క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే అవసరం



కరాటే శిక్షణలో పాల్గొన్న అమ్మాయిలు

ఉరవకొండ: బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని సీనియర్ కరాటే మాస్టర్ బ్లాక్ బెల్ట్ ఓబుళరావు తెలిపారు. శనివారం స్థానిక ఉరవకొండ ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కరాటే శిక్షణ క్యాంపు ప్రారంభించారు. ఓబుళరావు మాట్లాడుతూ అమ్మాయిలకు కరాటేలో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా క్యాంపు ప్రారంభించామన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

కుందుర్పి: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, క్రియేటర్ కృష్ణ, ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్ బాబు అన్నారు. శనివారం స్థానిక గురుకుల బాలుర పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల భవిష్యత్తు కోసం దిక్సూచి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్లు రఘువీరా, దిలీప్, బొమ్మలింగ, నాగరాజు, పాల్గొన్నారు.

'స్వచ్ఛత'కు సహకరించాలి

బ్రహ్మసముద్రం : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని సంతేకొండాపురంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లతో పాటు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ దాసానాయక్, ఎంఈఓలు ఓబుళపతి, కృష్ణానాయక్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, సర్పంచ, మల్లెల వనిత పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

కంబదూరు: మండలంలో పంట సాగు చేసి ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ జాఫర్ తెలిపారు. శనివారం ఆయన తిమ్మాపురంలో రైతులకు ఈకేవైసీ చేశారు. ఆయా గ్రామాల్లో చేస్తున్న ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెల 23 వరకు గడువు ఉందన్నారు.

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

కంబదూరు: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఎట్టకేలకు ఈనెల 24 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఏఓ జాఫర్ శనివారం తెలిపారు. వారంలో మంగళవారం, బుధవారాల్లో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. రోజూ రెండు గ్రామాలు చొప్పున ఉదయం 8.30 గంటల నుంచి 2 గంటల వరకు ఒక గ్రామం, 2 గంటల నుంచి 4 గంటల వరకు మరో గ్రామంలో నిర్వహిస్తామన్నారు.

మతాలను గౌరవిద్దాం..



మాట్లాడుతున్న పాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గంటౌన్: మన మతాన్ని గౌరవిద్దాం..పరమతాలను ప్రేమిద్దామని రాయదుర్గం పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్బీ అతిథి గృహం వద్ద పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి సతీష్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో హిందూ,ముస్లిం, క్రైస్తవులు స్వేచ్ఛగా జీవిస్తున్నారని, ఇలాంటి తరుణంలో ఇటీవల రాధామనోహర్ దాస్ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే ఏపీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.అసోసియేషన్ సభ్యులు కిరణ్కుమార్, ఆనంద్, మోషే పాల్గొన్నారు.

తప్పు చేశాను.. .క్షమించండి

- సీడబ్ల్యూసీ కౌన్సెలింగ్లో రూప



కౌన్సెలింగ్ కోసం 108లో అనంతపురానికి తరలిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: బిడ్డను అమ్మి తప్పు చేశానని రాయదుర్గానికి చెందిన రూప పశ్చాత్తాప పడింది. తనను క్షమించాలని.. ఇక నుంచి బిడ్డను బాగా చూసుకుంటానని అధికారులను వేడుకుంది. కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన రూప ప్రసవమైన 20 రోజులకు తన మగబిడ్డను విక్రయించిన విషయం తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శనివారం ఉదయం ఏరియా ఆస్పత్రి నుంచి బిడ్డతోపాటు రూపను 108 వాహనంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిమిత్తం అనంతపురంలోని బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచారు. తన తప్పు తెలుసుకున్నానని, బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటూ తప్పును సరిదిద్దుకుంటానని వేడుకుంది. దీంతో సీడబ్ల్యూసీ సభ్యులు మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. ఆమెతో రాతపూర్వకంగా రాయించుకు న్నారు. అనంతరం తల్లీబిడ్డను రాయదుర్గం పంపినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు.



ఉంతకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం

ఉంతకల్లు రిజర్వాయర్ హుళక్కేనా?


హెచ్ఎల్సీ ప్రధాన కాలువ ద్వారా 105 కిలోమీటరు వద్ద 18 కిలోమీటర్ల కాలువ తవ్వి నేమకల్లు- ఉంతకల్లు మధ్య పది టీఎంసీల సామర్థ్యంతో రూ.1,180 కోట్లతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని సంకల్పించా మని, గతంలోనే రూ.4.5 కోట్లతో సమగ్ర నివేదికలు సిద్ధం చేయించామని, మళ్లీ అధికారంలోకొస్తే దీన్ని తప్పక పూర్తిచేసి ఆంజనేయస్వామి రిజర్వాయరుగా నామకణం చేస్తామని కాలవహామీ ఇచ్చారు. ఆచరణలో పట్టించుకోలేదు.

ఆధునికీకరణ ఎన్నడు?

తుంగభద్ర ఎగువ కాలువ రూ.600 కోట్లతో ఆధునికీకరణ చేయిస్తాం. కాలువ గండ్లు పడకుండా సంరక్షిస్తాం. చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరందించేలా కృషి చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాలవ ఊదరగొట్టారు. ఆచరణలో చూపలేదు.



హెచ్ఎల్సీ కాలువ (ఫైల్)



అధినేత చంద్రబాబుతో కలిసి మేనిఫెస్టో విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కాలవ (ఫైల్)

శ్రీనివాసుడి హామీలు గోవిందా గోవింద!

సాధారణ ఎన్నికల సమయంలో రాయదుర్గం కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు స్థానిక మేనిఫెస్టో తయారు చేసి, అలవిగాని హామీలు ప్రకటించారు. కూటమి అధికారంలో కొచ్చింది.. పాలన వందరోజులు పూర్తి చేసుకున్నా.. అధినేత చంద్రన్న బాట లోనే కాలవ శ్రీనివాసులు ఏ ఒక్క హామీనీ అమలు చేయలేకపోయారు. కేవలం కాలవ రూపొందించిన మేనిఫెస్టో ప్రచార ఆర్భాటానికే సరిపోయిందని, ఇది కేవలం వంచన పాలన అని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

– రాయదుర్గం:

- ప్రచార ఆర్భాటానికే పరిమితమైన కాలవ మేనిఫెస్టో
- అధినేత చంద్రబాబు బాటలోనే స్థానిక ఎమ్మెల్యే కాలవ
- లక్ష ఎకరాలకు సాగునీరిచ్చే కార్యాచరణ ఏదీ?
- సూపర్సిక్స్తో పాటు స్థానిక ఎమ్మెల్యే మేనిఫెస్టోపై ప్రజల్లో ఆశలు
- వంద రోజులైనా ఒక్క సమస్యపై దృష్టి సారించని వైనం
- వంచన పాలనపై ప్రజల్లో పెదవి విరుపు

సూపర్సిక్స్ హామీలు నమ్మి ఓట్లేసిన వారు..

నియోజకవర్గం	రాయదుర్గం
పురుష ఓటర్లు	1,30,794
మహిళలు	1,33,516
మొత్తం	2,64,352
పోలైన ఓట్లు	2,27,248
కూటమి నేతలను నమ్మి ఓట్లేసిన వారు	1,29,307

రాయదుర్గం నియోజకవర్గంలోని రాయదుర్గంఅర్బన్ సహా డీ హీరేహాళ్, గుమ్మఘట్ట, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మండలాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో పురుష ఓటర్లుగా 1,30,794, మహిళా ఓటర్లుగా 1,33,516 మొత్తం 2,64,352 మంది ఓటర్లుగా నమోదుకాబడ్డారు. ఇందులో 2,27,248 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సూపర్సిక్స్ హామీలు, స్థానిక మేనిఫెస్టోకు ఆకర్షితులై 1,29,307 మంది టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులకు మద్దతుగా నిలిచి ఎమ్మెల్యేగా గెలిపించారు. ఇచ్చిన వాగ్దానాలు ఎప్పుడు నెరవేరుస్తారోనని మహిళలు, రైతులు, యువత, వృద్ధులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆయకట్టు.. కనికట్టేనా?



హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణ జలాలతో బీటీప్రాజెక్ట్ నింపుతాం. అధికారం చేపట్టగానే ఆ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా కృషి చేస్తాం. మెజార్టీ చెరువులు నింపుతాం. తద్వారా హెచ్ఎల్సీ కలుపుకొని, లక్ష ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి తెస్తామని కాలవ హామీ ఇచ్చారు. నేటికీ పట్టించుకోలేదు.

ఎన్నికల్లో కాలవ హామీలు ఇవీ...



గార్మెంట్స్ కార్మికులను ఆదుకునేలా చర్యలు చేపడతాం. టెక్స్టైల్స్ పరిశ్రమలో అందుబాటులో ఉండే అన్ని యూనిట్లను వినియోగంలోకి తీసుకొస్తాం. గార్మెంట్స్ రంగాన్ని మరింత విస్తరించేలా కృషి చేస్తాం. అన్ని సౌకర్యాలూ కలగజేస్తాం.

- పాలిటెక్నిక్ కళాశాలలో వసతులు పెంచి మరిన్ని కోర్సులు అందుబాటులోకి తెస్తాం.
- అర్ధంతరంగా ఆగిన ఇండోర్ స్టేడియం పూర్తి చేసి క్రీడాకారులకు బహుమతిగా ఇస్తాం.
- బాలికల జూనియర్ కళాశాలకు నూతన పక్కా భవనం నిర్మిస్తాం.
- గుండ్లపల్లి-రాయదుర్గం, రాయదుర్గం-బళ్లారి రహదారుల విస్తరణ చేపడతాం.
- రాయదుర్గం ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణాలు చురుగ్గా పూర్తిచేసేలా కృషి చేస్తాం. 100 పడకలు అందుబాటులోకి తెస్తాం.
- డి హీరేహాళ్లో నూతన ఇంటర్ కళాశాల భవనాలు నిర్మిస్తాం. కణేకల్లులో డిగ్రీ కళాశాల అందుబాటులోకి తెస్తాం.
- పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తాం.
- గుమ్మఘట్ట మండలం గోనబావిలో అర్ధంతరంగా ఆగిన ఎంజేపీ పాఠశాలను పూర్తిచేస్తాం. డీ హీరేహాళ్లో పక్కాభవనం నిర్మిస్తాం
- రాయదుర్గం,డీ హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లోని వేదావతి హగరిలో సబ్సర్ఫేస్ డ్యాంలు నిర్మిస్తాం.
- బిందుసేద్యానికి పూర్వవైభవం తీసుకొస్తాం
- డీ హీరేహాళ్, కణేకల్లు, రాయదుర్గంలో షాదీ మహల్ నిర్మాణం పూర్తి చేస్తాం. మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తాం.



సూపర్సిక్స్ హామీలపై కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ (ఫైల్)

- టిడ్కోఇళ్లు పూర్తిచేసి పేదలకు గృహయోగం కల్పిస్తాం.
- ఆగిన రైల్వే వంతెనలు పూర్తి చేస్తాం.
- కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఎడారి నివారణకు చర్యలు తీసుకుంటాం. ఈ హామీలు ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదు.

మాల్యం బ్రాంచ్ కెనాల్ హామీ నీటి మూటే..

హంద్రీనీవా 36వ ప్యాకేజీ ద్వారా రూ.260 కోట్లతో మాల్యం బ్రాంచ్ కెనాల్ పనులు టీడీపీ హయాంలో చేపట్టాం. ఈ పథకం పూర్తయితే 16,500 ఎకరాలు కొత్త ఆయకట్టు సాగులోకి వస్తుంది. జీడిపల్లి నుంచి కోకూర్తి వరకు నీరొచ్చింది. దాన్ని పూర్తిచేస్తే కణేకల్లు మండలంలోని సొల్లాపురం, హనకనహాళ్, మాల్యం, తుంబిగనూరు గ్రామాలకు సాగునీరు ఇవ్వొచ్చు. నేను గెలిస్తే ఈ పథకం వినియోగంలో కి తీసుకొస్తాం. సింగేపల్లి ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తాం బొమ్మనహాళ్ మండలం సింగేపల్లి వద్ద అర్ధంతరంగా ఆగిన ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరిస్తాం. వేదావతి నదిలో నాలుగు పిల్లర్పైపులు ఏర్పాటుచేసి 600 ఎకరాలకు సాగునీరు ఇస్తామని కాలవ ఇచ్చిన హామీలు ఇప్పట్లో నెరవేరేలా లేదు.

ఉంతకల్లు రిజర్వాయర్ పూర్తి చేయాలి



ఎన్నికల వాగ్దానం మేరకు నేమకల్లు- ఉంతకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తిచేయాలి. ఇది పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. పాలకులు దృష్టి సారించాలి. – దేవరెడ్డి, ఉంతకల్లు, బొమ్మనహాళ్ మం.

గార్మెంట్స్ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి



టెక్స్టైల్ పరిశ్రమతో పాటు గార్మెంట్ పరిశ్రమల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేయాలి. వేలాది మంది ఈ వృత్తిపై ఆధారపడి ఉన్నారు. పూర్వవైభవం తెచ్చేలా కృషి చేయాలి.

– సైపుల్లా, రాయదుర్గం పట్టణం

డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయండి



కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే కణేకల్లులో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీచ్చారు. కణేకల్లులో డిగ్రీ కాలేజీ అవసరం చాలా ఉంది. డిగ్రీ కాలేజీ లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు రాయదుర్గానికి మరికొంతమంది విద్యార్థులు ఉరవకొండకెళ్లి డిగ్రీ చదువుతున్నారు. డిగ్రీ కాలేజీ కోసం విద్యార్థులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.

– కొట్రేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, కణేకల్లు

ఎడారి నివారణ చర్యలు చేపట్టాలి



వేదవతి హగిరి పరీవాహక ప్రాంతంలో విస్తరించిన ఇసుక దిబ్బలతో రైతులంతా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక మేటలతో పంట సాగు కూడా చాలా కష్టంగా మారింది. ప్రభుత్వం ఎడారి నివారణ చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

– రమేష్, మీన్లహళ్లి, కణేకల్లు మండలం

బీటీపీకి నీరందించాలి



ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు బీటీ ప్రాజెక్టుకు నీరందించాలి. ఈ ప్రాంత కరువు జీవన విధానం దృష్టిలో ఉంచుకొని సకాలంలో ఈ పనులు పూర్తి చేసేలా పాలకులు, అధికారులు కృషి చేయాలి.

– లక్ష్మి కాంతారెడ్డి, రైతు, కలుగోడు, గుమ్మఘట్ట మండలం

టీడీపీవి ఉత్తుత్తి హామీలు



చంద్రబాబు వంద రోజుల పాలన అధ్వానంగా సాగింది. అధికారం చేపట్టగానే అమల్లోకి తెస్తామన్నా ఆరు గ్యారెంటీ పథకాలు పత్తా లేకుండా పోయాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆర్భాటంగా మేనిఫెస్టో అందుబాటులోకి తెచ్చారు. వంద రోజులు దాటినా ఒక్కదాన్ని నెరవేర్చలేదు. ప్రజలంతా సూపర్సిక్స్ హామీల కోసం ఎదురుచూస్తున్నారు. వంద రోజుల్లో నెరవేర్చలేకపోయినా కనీసం కార్యాచరణ కూడా చేపట్టలేదు. గత వైఎస్సార్సీపీ హయాంలో వంద రోజుల పాలనలో 87 శాతం హామీలు అమలుచేసి పేదల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానం నెరవేర్చేలా కృషి చేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

క్రీడలతోనే మానసికోల్లాసం



గుమ్మఘట్టలో జరిగిన ఎస్జీఎఫ్ క్రీడాపోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుమ్మఘట్ట: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ నాగమణి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్జీఎఫ్ క్రీడాపోటీలు ముగిశాయి. అండర్ -14, అండర్ -17 విభాగంలో బాలబాలికలకు హెచ్ఎం యోగేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, బ్యాడ్మింటన్, చెస్, పరుగుపందెం పోటీల్లో ప్రతిభ కనబరిచడంతో నియోజకవర్గ క్రీడా పోటీలకు 14 జట్లు ఎంపికైనట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ఎస్ఐ ఈశ్వరయ్య రూ.3 వేలు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి,ఉపసర్పంచ్ ప్రతాప్రెడ్డి, ఎంఈఓ-2 రామచంద్ర, ఈఓఆర్డీ సురేశ్బాబు, పీడీలు విజయలక్ష్మి, చంద్రకళ, పీఈటీలు కృష్ణవేణి, నాగరాజు, ప్రతాప్, ఎస్ఎంసీ చైర్పర్సన్ యశోధర తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాల కోసం స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఉరవకొండ: స్థానిక రాయంపల్లి లేఅవుట్లో ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి అధికారులు స్థల సేకరణ చేపట్టారు. శనివారం రాయంపల్లి లేఅవుట్లోని సర్వేనం.629లోని 2.68 ఎకరాల స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి ఎంపిక చేశారు. తహసీల్దార్ మహబూబ్బాషా మాట్లాడుతూ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. సర్వేయర్ రత్నాకర్, ఆర్ఐ రామకృష్ణ, సచివాలయ సర్వేయర్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

తహసీల్దార్ నాగరాజు బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం: రాయదుర్గం తహసీల్దార్గా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సత్యసాయి జిల్లా కొత్తచెరువు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో తహసీల్దార్గా అలెగ్జాండర్ను కలెక్టర్ నియమించారు. వివిధ కారణాలతో ఆయన విధుల్లో చేరలేదు. దీంతో నెలన్నర రోజులకుపైగా నూతన తహసీల్దార్ విధుల్లో చేరలేదు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మంత్రి పయ్యావుల కేశవ్



గడేకల్లులో ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం గడేకల్లు గ్రామంలో మంత్రి పర్యటించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదికలో మంత్రి మాట్లాడారు. పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ అధిక సంఖ్యలో వినతులు అందించారు. 67వ జాతీయ రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇంత వరకూ పరిహారం అందలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు సునీతాబాయి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, సర్పంచు సుశీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శివాలయంలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమీపంలో ఉన్న శివాలయంలో హుండీని ధ్వంసం చేసి, అందులోని నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం శివాలయంలో పూజలు చేయడానికి వెళ్లిన పూజారి ఈవిషయాన్ని గమనించి, ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో ఎంత నగదు ఎత్తుకెళ్లారో విచారణలో తేలాల్సి ఉంది.

కూడేరు పోలీసు స్టేషన్ తనిఖీ

కూడేరు: కూడేరు పోలీసు స్టేషన్ను డీఎస్పీ శ్రీనివాసులు శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిస్థితిపై ఆరా తీశారు. మండలంలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు, పేకాట జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని సీఐ శివరాముడును ఆదేశించారు.

ఎన్ఎంఎంఎస్కు దరఖాస్తు చేసుకోండి

శెట్టూరు: మండలంలోని 8వ తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా తక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తెలుగు భాషకు గురజాడ సేవలు అమోఘం

ఉరవకొండ: తెలుగు భాషకు గురజాడ చేసిన సేవలు అమోఘమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ అయ్యన్న తెలిపారు. శనివారం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జయంతి సభ ఏర్పాటు చేశారు. తెలుగు సీనియర్ అధ్యాపకులు పరమేష్ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నారాయణస్వామి, వెంకటరాముడు పాల్గొన్నారు.

258 మంది బడిబయట పిల్లల గుర్తింపు

శెట్టూరు: మండలంలో సుమారు 258 మంది బడిబయట పిల్లలను గుర్తించినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంఆర్సీలో ఎంఈఓ-2 వాణీదేవితో కలిసి ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బడిబయట ఉన్న 258 మందిని వెంటనే బడిలో చేర్పేలే చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలను 9440699404, 9441575719 ఈ నంబర్లలో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

కళ్యాణదర్గం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉండొచ్చని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి తెలిపారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు రహదారుల్లో డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కూడేరు: మండలంలోని అరవకూరు సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి, ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శివరాముడు శనివారం తెలిపారు. వారి నుంచి రూ.26,450 నగదును, ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుందుర్పి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యాధికారిణి అనూషా, తదితరులు తెలిపారు. శనివారం స్థానిక మలయనూరు, శీగలపల్లి తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రామాంజినేయులు, నవీన్, సీడీఎస్ సూపర్ వైజర్ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'తో ఆరోగ్యం

కూడేరు: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పొదుపు సంఘాల మహిళలతో కలిసి అధికారులు శనివారం మానవహారం, ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీఎం రాజశేఖర్, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభావతి, వెలుగు కార్యాలయ సీసీలు రమణ, నాగప్ప, మారెప్ప పాల్గొన్నారు.

ఆటోబోల్తా పడి ఇద్దరికి గాయాలు

కూడేరు: మండల శివారు ప్రాంతమైన లెప్రసీ కాలనీ సమీపంలో శనివారం ఆటో బోల్తా పడి రోడ్డు పక్కన పడిపోయింది. దీంతో అందులో ఉన్న ఖాజా, రహీం (అనంతపురానికి చెందిన గుజరీ వ్యాపారులు) గాయపడ్డారు.

దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం డివిజన్ స్థాయిలోని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులను నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత శనివారం తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లకు ఉత్తర్వులను జారీ చేశారు. ఎస్సీ ,ఎస్టీ అభ్యర్థులు ఈనెల 27లోపు దరఖాస్తులను రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నూతన వాల్మీకి విగ్రహం ఊరేగింపు

కుందుర్పి: మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంకు సర్కిల్లో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. శనివారం రూ.1.50 లక్షలు వెచ్చించి వాల్మీకి విగ్రహాన్ని కుందుర్పికి తీసుకొచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. పెట్రోల్ బంక్ కూడలి వద్ద రూ.5లక్షలు వెచ్చించి విగ్రహ ఏర్పాటుకు భవనం నిర్మించారు. విగ్రహ ఏర్పాటుకు రూ.10 లక్షలు వెచ్చించే స్థలాన్ని మాజీ సర్పంచ్ బోయ పాతన్న విరాళంగా అందజేశారు.

భక్తిశ్రద్ధలతో గిరినాథస్వామి జలధిపూజ



ధ్వజస్తంభం వద్ద రబీ పంట దిగుబడులను తెలుపుతున్న అర్చకులు

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడిలో శ్రీగిరినాథ స్వామి జలధిపూజా కార్యక్రమాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి మూలవిరాట్కు కలశంలోని జలంతో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని పూజించారు. జలధిపూజాలో భాగంగా అన్నదానం చేశారు.